క్లుప్తంగా

యాగశాలకు శంకుస్థాపన



యాగశాల ఏర్పాటుకు శంకుస్థాపన చేస్తున్న సర్పంచ్ సీతారాంరెడ్డి

పెన్‌పహాడ్ : మండల పరిధిలోని చీదెళ్ల గ్రామంలో వచ్చే నెల 2నుంచి 4వతేదీ వరకు నూతనంగా నిర్మించిన అభయాంజనేయ స్వామి దేవాలయం, ధ్వజస్తంభం, నాభిశిల, గణపతి, ఒంటె వాహనం ప్రతిష్ఠాపన మహోత్సవంలో భాగంగా గురువారం యాగశాల ఏర్పాట్లకు గ్రామ సర్పంచ్ పరెడ్డి సీతారాంరెడ్డి శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ వెన్న సీతారాంరెడ్డి, ఎంపీటీసీ జూలకంటి వెంకట్‌రెడ్డి, ఉపసర్పంచ్ బిజిగ గోపి,అమృతారెడ్డి, గోపిరెడ్డి, రణబోతు శ్రీనివాస్‌రెడ్డి, జాల సైదులు తదితరులు పాల్గొన్నారు.

మాదిగలపై దాడులను ఖండించాలి

ఆత్మకూర్ (ఎస్) : మండల పరిధిలోని కందగట్ల గ్రామంలో పలువురు మాదిగ కులస్తులపై గురువారం అర్ధరాత్రి పోలీసులు దాడులు చేసి అక్రమంగా అరెస్టులు చేయడాన్ని ప్రతి ఒక్కరూ ఖండించాలని ఎమ్మార్పీఎస్ జిల్లా ఇన్‌చార్జ్ యాతాకుల రాజన్నమాదిగ అన్నారు. గురువారం గ్రామంలో ఎమ్మార్పీఎస్, మహాజన సోషలిస్టు పార్టీ ఆధ్వర్యంలో ఎస్సీ కాలనీని సందర్శించి దళితులతో మాట్లాడారు. గ్రామంలో కొందరు కులాల మధ్య చిచ్చుపెట్టే ప్రయత్నం చేస్తున్నారని, దళితుల పట్ల చులకనగా చూస్తున్నారని విమర్శించారు. పోలీసులు విచారణ చేయకుండా అత్యుత్సాహం చూపారని ఆరోపించారు. ఆయన వెంట నాయకులు మేడి కృష్ణ, ముల్కలపల్లి రవి, మారేపల్లి జగన్, చింత వినయ్‌బాబు, వెంకన్న, లక్ష్మమ్మ, వెంకటమ్మ, సంధ్య తదితరులు ఉన్నారు.

వననర్సరీల పరిశీలన



వడగళ్ల వర్షానికి దెబ్బతిన్న నర్సరీని పరిశీలిస్తున్న అధికారులు

అర్వపల్లి : అకాల వర్షం, వడగళ్లతో వననర్సరీలకు తీవ్రనష్టం వాటిల్లడంతో గురువారం మండల పరిధిలోని వివిధ గ్రామాల్లో నర్సరీలను ఉపాధిహామీ, అటవీశాఖాధికారులు పరిశీలించారు. తిమ్మాపురం, అడివెంల, కుంచమర్తి, వేల్పుచర్ల తదితర గ్రామాల్లో నర్సరీలను పరిశీలించి నష్టం వివరాలను సేకరించారు. ఆయా కార్యక్రమాల్లో ఉపాధిహామీ మండల ఏపీఓ సీహెచ్.ఉపేందర్, ఈసీ నగేష్, ఫారెస్ట్ బీట్ అధికారి మురళి, టీఏలు యాదమ్మ, దీపిక, నాగమణి, ఫీల్డ్‌అసిస్టెంట్లు పాల్గొన్నారు.

వాహనాల తనిఖీ



వాహనాన్ని తనిఖీ చేస్తున్న ఎస్‌ఐ బి.శివకుమార్

తిరుమలగిరి (తుంగతుర్తి) : మద్యం సేవించి వాహనాలు నడిపితే కేసులు నమోదు చేస్తామని మండల ఎస్‌ఐ బి.శివకుమార్ హెచ్చరించారు. గురువారం స్థానిక తెలంగాణ చౌరస్తాలో పలు వాహనాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ట్రాఫిక్ నిబంధనలు ప్రతిఒక్కరూ పాటించాలని కోరారు. ఆయన వెంట ఏఎస్‌ఐ జగన్మోహన్ రెడ్డి, సిబ్బంది సైదులు ఉన్నారు.

నిరుద్యోగ నిరసన ర్యాలీని విజయవంతం చేయాలి

నాగారం : నల్లగొండ జిల్లా కేంద్రంలో నేడు నిర్వహించే నిరుద్యోగ నిరసన ర్యాలీని విజయవంతం చేయాలని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు తొడుసు లింగయ్యయాదవ్ కోరారు. గురువారం మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఉద్యోగాలను భర్తీ చేయడంతో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. కేసీఆర్ నిరుద్యోగులను మోసం చేశారని అన్నారు. ర్యాలీకి పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి హాజరవుతారని తెలిపారు.

తిరుమలగిరి (తుంగతుర్తి) : నల్లగొండ జిల్లా కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించే నిరుద్యోగ నిరసన ర్యాలీని జయప్రదం చేయాలని ఆ పార్టీ మండల అధ్యక్షుడు వై.నరేష్ కోరారు. గురువారం మండల కేంద్రంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. తెలంగాణ ప్రభుత్వం నిరుద్యోగులకు నిరుద్యోగ భృతి ఇవ్వాలని డిమాండ్ చేశారు. నల్లగొండలో జరిగే ర్యాలీకి కాంగ్రెస్ కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

భోజనశాల నిర్మాణానికి విరాళం

నడిగూడెం : మండల కేంద్రంలోని శ్రీ షిర్డీ సాయి మందిరం ఆవరణలో నిర్మించనున్న భోజనశాల నిర్మాణానికి గురువారం నారాయణపురం గ్రామానికి చెందిన కంబాల గురులింగం రమావసంత దంపతులు రూ.25 వేల విరాళాన్ని ఆలయ కమిటీకి అందజేశారు. ఈ కార్యక్రమంలో వెంకటేశ్వరరావు, కృష్ణయ్య, తదితరులు పాల్గొన్నారు.

అలంకారప్రాయంగా రైతు వేదికలు

- ఐదు క్లస్టర్ గ్రామాల్లో ఏర్పాటు
- సదస్సులకు వెళ్లేందుకు రైతుల నిరాసక్తి
- నిధులున్నా నిర్వహణను పట్టించుకోని అధికారులు

పెన్‌పహాడ్ : వ్యవసాయ కస్టర్ల పరిధిలో రూ.లక్షలు వెచ్చించి నిర్మించిన రైతువేదికలు సద్వినియోగానికి నోచుకోవడం లేదు. రైతుల కోసం సమావేశ మందిరం నిర్మించి కనీస నీటి వసతి కల్పించలేదు. మరుగుదొడ్లు నిర్మించినా నీటి సౌకర్యం లేక అలంకారప్రాయంగా మిగిలిపోతున్నాయి. ఊరికి దూరంగా నిర్మించడంతో కొన్ని రైతు వేదికలు మందుబాబులకు అడ్డాలుగా మారుతున్నాయి. ప్రభుత్వం పంటల సాగు సమావేశాలను ఏర్పాటు చేసుకునేందుకు వీలుగా గ్రామాలకు అందుబాటులో రైతు వేదికలను నిర్మించింది. కానీ వీటి నిర్వహణ లోపంతో కొన్ని క్లస్టర్లలో ఇవి నిరుపయోగంగా మారాయి. మండలంలోని 29 గ్రామపంచాయతీలు ఉండగా ఐదు క్లస్టర్లలో రైతు వేదికలను నిర్మించింది. అన్నారం, దూపహాడ్ గ్రామాల్లో రైతులకు అందుబాటులో ఉండగా చీదెళ్ల, అనాజిపురం, పెన్‌పహాడ్ క్లస్టర్లలో వేదికలు ఊరికి దూరంగా నిర్మించారు. ప్రతి క్లస్టర్ పరిధిలో మూడు గ్రామాల నుంచి ఐదు గ్రామాల వరకు ఉన్నాయి. రైతు వేదికల వద్ద మౌలిక సదుపాయాలను పూర్తిస్థాయిలో ఏర్పాటు



అనాజిపురంలోని రైతువేదిక

చేయడంలో అధికారులు విఫలమయ్యారు.

కానరాని సమీక్షలు..

ప్రతి సీజన్‌లో రైతులు సాగు చేసే విధానాలు, మేలైన విత్తనాలు, సస్యరక్షణ చర్యలు సాగు విధానాల గురించి రైతులకు అవగాహన కల్పించడం కోసం రైతు వేదికలు నిర్మించారు. నెలనెలా ఈ రైతు వేదికల్లో సంబంధిత అధికారులు సమావేశాలను ఏర్పాటు చేయాలి. కానీ ఇప్పటి వరకు ఏలాంటి అవగాహన సదస్సులు ఏర్పాటు చేసిన దాఖలాలు లేవని రైతులు చెబుతున్నారు. సమావేశాలు ఎప్పుడు జరుగుతున్నాయో కూడా తమకు సమాచారం ఇవ్వడం లేదని అంటున్నారు. సాగుపై సలహాలు, అనుమానాలను నివృత్తి చేసేందుకు ఏఈఓలు అందుబాటులో ఉన్నా గ్రామానికి దూరంగా ఉన్న వేదికల వద్దకు రైతులు వెళ్లేందుకు నిరాసక్తతను వ్యక్తం చేస్తున్నారు.

సదస్సులు ఏర్పాటు చేస్తున్నాం



రైతు వేదికల్లో శిక్షణ తరగతులను, పంటల సాగులో అవగాహన సదస్సులు ఏర్పాటు చేస్తున్నాం. క్లస్టర్ల పరిధిలో గల రైతులు ఆయా గ్రామాల నుంచి సమావేశాలకు వచ్చేందుకు ఇబ్బంది పడుతున్నారు. అన్ని గ్రామాల్లో పర్యటించి పంటల సాగులో మెళుకువలు, సస్యరక్షణ చర్యలను వివరిస్తున్నాం.

– బి.కృష్ణసందీప్, మండల ఏఓ

నిధులున్నా నిర్వహణ లోపం...

ప్రతి రైతు వేదిక నిర్వహణకు నెలకు రూ.9వేలు చొప్పున ప్రభుత్వం కేటాయిస్తోంది. ఈ నిధులను ఏఈఓ ఖాతాల్లో నాలుగైదు నెలకొకసారి ప్రభుత్వం జమ చేస్తోంది. ఈ డబ్బును రైతు వేదికల్లో జరిగే సమావేశాలకు వచ్చే రైతులకు టీ, బిస్కెట్‌లతో పాటు ఇతర అవసరాలకు వినియోగిస్తారు. అయితే ఈ నిధులున్నా వాటిని ఖర్చు చేసేందుకు నిర్వాహకులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. రైతు వేదికలపై సంబంధిత అధికారులు దృష్టిసారించకపోవడంతో అవికాస్తా అలంకారప్రాయంగా మారుతున్నాయి.

ఆక్రమణలపై బహిరంగ చర్చకు సిద్ధంగా ఉన్నాం

దురాజ్‌పల్లి (సూర్యాపేట) : పట్టణ పరిధిలోని వజ్రా టౌన్‌షిప్‌కు మూసీ కెనాల్‌కు మధ్యలో ఉన్న రోడ్డులోని కొంత భాగాన్ని వట్టే జానయ్య ఆక్రమించి అక్రమ కట్టడం చేస్తున్నది నిజమని, ఆక్రమణలపై బహిరంగ చర్చకు సిద్ధంగా ఉన్నామని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి సలిగంటి వీరేంద్ర, పార్లమెంట్ కో కన్వీనర్ తుక్కని మన్మధరెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు చల్లమల్ల నరసింహ, దళిత మోర్చా జిల్లా అధ్యక్షుడు వల్దాసు ఉపేందర్ అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని బీజేపీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. మూసీకాలువ రోడ్డు భూమిని ఆక్రమించారని ప్రశ్నిస్తే సబ్జెక్టు గురించి మాట్లాడకుండా మా నాయకుడు సంకినేని వెంకటేశ్వర్‌రావుపై అసభ్య పదజాలంతో వ్యక్తిగత విమర్శలు చేయడం



మాట్లాడుతున్న బీజేపీ నాయకులు

తగదన్నారు. టౌన్‌షిప్ అక్రమాలపై టౌన్‌షిప్‌కు భూమి అమ్మిన వారి సమక్షంలో బహిరంగ చర్చకు సిద్ధంగా ఉన్నామని సవాల్ విసిరారు. సమావేశంలో జిల్లా అధికార ప్రతినిధి పలస మల్సూర్‌గౌడ్, కోశాధికారి పగిళ్ల సూసిందర్‌రెడ్డి, పట్టణ ప్రధాన కార్యదర్శి అరూరీ శివ, జిల్లా నాయకులు దాసరి వెంకన్న యాదవ్, తదితరులు ఉన్నారు.

సాయి మందిరంలో పూజలు, అన్నదానం



అన్నదానం చేస్తున్న అర్చకుడు సాయిరాం

అర్వపల్లి : మండల కేంద్రంలోని శ్రీయోగా షిరిడీ సాయిబాబా మందిరంలో గురువారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం పంచామృతాభిషేకం, అలంకరణ, అర్చనలు, మధ్యాహ్న హారతి నిర్వహించారు. అనంతరం ఉపాధిహామీ పథకం సీఓల సంఘం జిల్లా అధ్యక్షుడు బొబ్బిలి సుధీర్‌రెడ్డి–నవ్య దంపతులు 200మందికి అన్నదానం చేశారు. కార్యక్రమంలో మందిర అర్చకుడు కండవల్లి సాయిరాం, ఎంపీఓ ఉపేందర్‌రావు, ఉపాధిహామీ ఏపీఓ సీహెచ్.ఉపేందర్, ఈసీ నగేష్, టీఏలు యాదమ్మ, దీపిక, నాగమణి, కార్యదర్శి నాగయ్య, వీఆర్‌ఏలు నర్సింగ విజయ్, సౌజన్య, నవ్య, సీఓలు ఉన్నారు.

కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి



చివ్వెంల : ఐకేపీ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎంపీపీ కుమారి



తిరుమలగిరి (తుంగతుర్తి) : కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎంపీపీ స్నేహలత

చివ్వెంల(సూర్యాపేట) : రైతులు ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ ధరావత్ కుమారి బాబునాయక్ అన్నారు. గురువారం మండల పరిధిలోని అక్కలదేవిగూడెం గ్రామంలో ఏర్పాటు చేసిన ఐకేపీ కేంద్రాన్ని ప్రారంభించి మాట్లాడారు. రైతులకు గ్రామాల్లో అందుబాటులో ఉండాలనే లక్ష్యంతో ప్రభుత్వం కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ రంగారావు, ఎంపీడీఓ ఎల్.లక్ష్మి, ఏపీఎం రాంబాబు, ఎంఎస్ అధ్యక్షురాలు జయలక్ష్మి, గ్రామస్తులు యలమంద, నాగరాజు, విజయ్, యల్లయ్య, వెంకన్న, లోడే వెంకన్న, గురువయ్య, సైదులు, నాగయ్య, వీబీకే, ఝాన్సీ, కోటేష్, సైదమ్మ, జయమ్మ, సునీత పాల్గొన్నారు.

మద్దిరాల : ప్రభుత్వం గ్రామాల్లో ఏర్పాటు చేసే ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని రైతు బంధు సమితి జిల్లా కోఆర్డినేటర్ ఎస్ఏ.రజాక్ అన్నారు. గురువారం మండల పరిధిలోని కుక్కడం గ్రామంలో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేస్తున్న ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వర్షాలు పడుతున్నందున ధాన్యం కాంటాలను వేగవంతం చేయాలని సూచించారు. కార్యక్రమంలో వైస్‌ఎంపీపీ బెజ్జంకి శ్రీరాం రెడ్డి, సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు కుందూరు విష్ణువర్ధన్‌రెడ్డి, జిల్లా నాయకులు గుడ్ల వెంకన్న, ఎంపీడీఓ సరోజ, ఏపీఎం మైసయ్య, సీసీలు రమేష్, నాగార్జున్‌రెడ్డి, వీబీకే అండెం యాదగిరి, అండెం మల్లయ్య, బింగి భిక్షపతి, ఆరునూర్ల వీరస్వామి, వెన్నెమల్ల జలేందర్, నాగయ్య, వెంకన్న, యల్లయ్య, యాదగిరి, కృష్ణయ్య, స్వరూప, ప్రమీల, తదితరులు పాల్గొన్నారు.



మద్దిరాల : ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎస్ఏ రజాక్

తిరుమలగిరి (తుంగతుర్తి) : ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలకు రైతులు నాణ్యమైన ధాన్యం తీసుకొచ్చి మద్దతు ధర పొందాలని ఎంపీపీ నెమురుగొమ్ముల స్నేహలత కోరారు. గురువారం మండలంలోని జలాల్‌పురం గ్రామంలో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆమె ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ వెంకన్న, ఏపీఎం సైదులు, తెడ్డు భాస్కర్, వేముల శ్రీనివాస్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

నష్టపోయిన రైతులకు పరిహారం చెల్లించాలి

తుంగతుర్తి : అకాల వర్షాలకు పంటలు దెబ్బతిని నష్టపోయిన రైతులకు ప్రభుత్వం నష్టపరిహారం చెల్లించి ఆదుకోవాలని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి మల్లేపాక సాయిబాబా అన్నారు. గురువారం మండల కేంద్రంలో బీజేపీ ఆధ్వర్యంలో తహసీల్దార్ రాంప్రసాద్‌కు వినతిపత్రం అందజేసి మాట్లాడారు. పంట నష్టపోయిన రైతులను ఆదుకోవడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. వరిపంట నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.30వేలు, పండ్ల తోటలు నష్టపోయిన రైతులకు ఎకరాలకు రూ.50వేల చొప్పున పంట నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు గాజుల మహేందర్, ఎంపీటీసీ ఉప్పుల పద్మలింగయ్య, పెండెం యాదగిరి, అంబటి రమేష్, కత్తుల నరేష్, నారాయణదాసు నాగరాజు, సాయికృష్ణ, సుధాకర్, లతీఫ్, అజిత్ పాల్గొన్నారు.

నాగారం : అకాల వర్షాలకు పంటలు దెబ్బతిని నష్టపోయిన రైతులను ప్రభుత్వం నష్టపరిహారం చెల్లించి ఆదుకోవాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, తుంగతుర్తి నియోజకవర్గ ఇన్‌చార్జ్ కడియం రామచంద్రయ్య కోరారు. గురువారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో బీజేపీ ఆధ్వర్యంలో తహసీల్దార్ హరిశ్చంద్రప్రసాద్‌కు వినతిప్రతం అందజేసి మాట్లాడారు. ఆకాల వర్షాలకు పంటలు



నాగారంలో తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న రామచంద్రయ్య తదితరులు

దెబ్బతిని రైతులు తీవ్రంగా నష్టపోయారని అన్నారు. వరిపంట నష్టపోయిన రైతులకు ఎకరానికి రూ.30వేలు, మామిడి, నిమ్మ రైతులకు ఎకరాకు రూ.50వేల చొప్పున ప్రభుత్వం నష్టపరిహారాన్ని చెల్లించాలని డిమాండ్ చేశారు. ఐకేపీల్లోని తడిసిన, రంగు మారిన ధాన్యాన్ని ప్రభుత్వమే కొనుగోలు చేసి రైతులకు మద్దతు ధర చెల్లించాలన్నారు. రైతులకు కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఫసల్ బీమా పథకాన్ని వర్తింపజేయాలన్నారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ పేరాల పూలమ్మ, బీజేపీ మండల అధ్యక్షుడు మొల్కపురి చిరంజీవి, దేశగాని నర్సయ్య, కొమిరెల్లి, ఎల్లాచారి, మహేందర్, మధు, వసంతకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

రైతాంగాన్ని ఆదుకోవాలి

ఆత్మకూర్–ఎస్ : అకాలవర్షాలతో నష్టపోయిన రైతులకు నష్టపరిహారం చెల్లించి ప్రభుత్వం ఆదుకోవాలని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ మండల నాయకురాలు కంచర్ల నర్సక్క డిమాండ్ చేశారు. గురువారం మండల పరిధిలోని తుమ్మలపెన్‌పహాడ్, దాచారం గ్రామాల్లో ఇటీవల వడగళ్ల వానతో దెబ్బతిన్న వరి, మిర్చి పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. వడగళ్ల వానతో పంట చేతికందే దశలో నేలపాలై రైతులు అప్పుల పాలవుతున్నారన్నారు. వరి, మిర్చి, మామిడి, మొక్కజొన్న రైతులకు ఎకరాలకు రూ.20వేల నష్టపరిహారం ఇవ్వాలన్నారు. ఐకేపీ కేంద్రాల్లో తడిసిన ధాన్యాన్ని కొర్రీలు లేకుండా ప్రభుత్వం వెంటనే కొనుగోలు చేయాలన్నారు. ఆమె వెంట నాయకులు అంజయ్య, రాములు, నల్లగొండ నాగయ్య, వెంకన్న, యల్లయ్య ఉన్నారు.



ఆత్మకూర్–ఎస్ : దాచారంలో నేలవాలిన వరి పొలాన్ని పరిశీలిస్తున్న నాయకులు

కొనుగోలు కేంద్రాల్లో కాంటాలు సత్వరమే నిర్వహించాలి



నూతనకల్ : రైతులతో మాట్లాడుతున్న తహసీల్దార్ జమీరుద్దీన్

పెన్‌పహాడ్ : ధాన్యం కాంటాలను సత్వరమే నిర్వహించాలని ఎంపీపీ నెమ్మాది భిక్షం అన్నారు. గురువారం మండల పరిధిలోని భక్తాళాపురం గ్రామంలోని సెర్ప్ కొనుగోలు కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా కాంటాలు నిర్వహించాలన్నారు. నిర్వాహకులు నిబంధనలకు అనుగుణంగా ఉన్న రాశులను గుర్తించి కాంటాలను సత్వరమే నిర్వహించి బస్తాలను ఎగుమతి చేయాలని సూచించారు. ఆయన వెంట నల్లపు రాంమ్మూర్తి, జుట్టుకొండ గణేష్, అనంతుల శ్రీనివాస్‌గౌడ్, ఐకేపీ నిర్వాహకులు తదితరులు ఉన్నారు.

నూతనకల్ : కొనుగోలు కేంద్రాల్లో సత్వరమే ధాన్యం కాంటాలు నిర్వహించి ధాన్యాన్ని తరలించాలని తహసీల్దార్ ఎండీ జమీరుద్దీన్ సూచించారు. గురువారం మండల పరిధిలోని దిర్శనపల్లి, ఎర్రపహాడ్ గ్రామాల్లోని కొనుగోలు కేంద్రాలను సందర్శించి ధాన్యం రాశులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కొనుగోలు కేంద్రాల్లో నిబంధనలకు అనుగుణంగా ఉన్న ధాన్యం రాశులను గుర్తించి సత్వరమే కాంటాలు నిర్వహించి ఎగుమతి చేయాలని నిర్వాహకులను ఆదేశించారు. ఆయన వెంట కేంద్రం నిర్వాహకులు ఉన్నారు.

తిరుమలగిరి (తుంగతుర్తి) : ఇటీవల కురిసిన వర్షాలకు తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వం మద్దతు ధరకు కొనుగోలు చేయాలని సీపీఎం మండల కార్యదర్శి గుమ్మడవెల్లి ఉప్పలయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం మండలంలోని తాటిపాముల గ్రామంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాన్ని ఆయన పరిశీలించి రైతులతో మాట్లాడారు. ఆయన వెంట సోమయ్య, అబ్రహాం, పిచ్చయ్య, సమ్మయ్య, కొమురెల్లి, రైతులు తదితరులు ఉన్నారు.

తడిసిన ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలి



మాట్లాడుతున్న ప్రజాపంథా జిల్లా కార్యదర్శి కొత్తపల్లి శివకుమార్

పెన్‌పహాడ్ : అకాల వర్షాలతో తడిసిన వరిధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయడంతో పాటు ఎకరానికి రూ.50వేల నష్టపరిహారం చెల్లించాలని సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా జిల్లా కార్యదర్శి కొత్తపల్లి శివకుమార్ డిమాండ్ చేశారు. బుధవారం సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా జిల్లా కమిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న గడపగడపకు ప్రజాపంథా ప్రజాపోరు యాత్ర మండల పరిధిలోని ధర్మాపురం, మహ్మదాపురం, సింగారెడ్డిపాలెం గ్రామాల్లో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతులను ఆదుకోకుండా నట్టేట ముంచుతున్నాయన్నారు. 15రోజులకు పైగా ఐకేపీ సెంటర్లకు వరిధాన్యం వచ్చి నిల్వ ఉండడంతో అకాల వర్షం రావడంతో పూర్తిగా తడిసి ముద్దగా మారి మొలకలెత్తుతున్నాయని తెలిపారు. ప్రజా పోరుయాత్రలో విద్యార్థులు, మేధావులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పీఓడబ్ల్యూ జిల్లా ప్రధాన కార్యదర్శి కొత్తపల్లి రేణుక, పీడీఎస్‌యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎర్ర అఖిల్‌కుమార్, నాయకులు గొడ్డలి నర్సయ్య, ఐఎఫ్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి భూక్య రాంజీ, పీఓడబ్ల్యూ జిల్లా ఉపాధ్యక్షురాలు సూరం రేణుక, కోశాధికారి జయమ్మ, రామన్న, పీవైఎల్ జిల్లా నాయకులు పరుశరాము, రాజశేఖర్, సునీల్, పద్మ తదితరులు పాల్గొన్నారు.

మే డే ఉత్సవాలను విజయవంతం చేయాలి

భానుపురి (సూర్యాపేట) : భవన నిర్మాణ కార్మిక సంఘం ఆధ్వర్యంలో నిర్వహించే ప్రపంచ కార్మిక దినోత్సవం మే డే వేడుకలను విజయవంతం చేయాలని ఆ సంఘం జనరల్ సెక్రటరీ బొమ్మగాని వెంకన్న పిలుపునిచ్చారు. గురువారం పట్టణంలో ప్రైవేట్ ఎలక్ట్రిషన్ టెక్నీషియన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మే డే ఉత్సవాల సన్నాహక సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. మే డే వేడుకల అనంతరం మంత్రి క్యాంపు కార్యాలయం నుంచి కేసారంలో జరిగే భానుపురి భవన నిర్మాణ కార్మిక సంఘం భవన శంకుస్థాపన కార్యక్రమానికి ర్యాలీగా తరలివెళ్లనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి హాజరవుతారని, శంకుస్థాపన అనంతరం జరిగే సభలో భవన నిర్మాణ రంగానికి చెందిన 13సంఘాల కార్మికులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో సూర్యాపేట ప్రైవేట్ ఎలక్ట్రిషన్ టెక్నీషియన్ యూనియన్ ప్రధాన కార్యదర్శి ఇరుగు సంజీవ, గౌరవ సలహాదారులు కటారి రాము, పిట్టల లింగయ్య, ఉపాధ్యక్షులు బానోతు రమణ, అహ్మద్, లక్ష్మీనారాయణ, కోశాధికారి రాజబోయిన వెంకటేష్, సభ్యులు మహేష్, నాగరాజు, వెంకన్న, అనిల్, నాగరాజు పాల్గొన్నారు.



భానుపురి : సమావేశంలో పాల్గొన్న నాయకులు

పెన్‌పహాడ్ : మే డే వారోత్సవాలను వాడవాడలా ఘనంగా నిర్వహించాలని సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యుడు రణపంగ కృష్ణ కోరారు. గురువారం మండల కేంద్రంలో నిర్వహించిన భవన నిర్మాణ కార్మికుల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. నేడు దేశంలో మోదీ ప్రభుత్వం లేబర్ కోడ్‌లు తెచ్చి పోరాడి సాధించుకున్న కనీస వేతనచట్టం, పనిభద్రత చట్టం పీఎఫ్, ఈఎస్‌ఐ లాంటి చట్టాలు లేకుండా చేస్తున్నారని వాపోయారు. మండలంలోని అన్ని గ్రామాల్లో మే డే సందర్భంగా వారం రోజుల పాటు ఆట, పాట, కవి సమ్మేళనాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మిక సంఘం మండల అధ్యక్షుడు ఎస్‌కె బాషా, వల్లపట్ల కృష్ణ, యాదగిరి, మామిడి హుస్సేన్, గణేష్, వెంకటమ్మ, లక్ష్మమ్మ పాల్గొన్నారు.

అంధత్వ నివారణే తెలంగాణ ప్రభుత్వ లక్ష్యం

అర్వపల్లి : అంధత్వ నివారణే లక్ష్యంగా తెలంగాణ ప్రభుత్వం కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రవేశపెట్టిందని, ప్రతిఒక్కరూ కంటి వెలుగును సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ మన్నె రేణుక లక్ష్మీనర్సయ్యయాదవ్ కోరారు. గురువారం మండలంలోని ఉయ్యాలవాడ గ్రామంలో ఆమె కంటి వెలుగు శిబిరాన్ని ప్రారంభించి మాట్లాడారు. 18ఏళ్లు పైబడి కంటి సమస్యలున్న ప్రతిఒక్కరూ కంటి పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ సాగర్ల బుచ్చయ్య, వైద్యాధికారిని శిరీష, సీహెచ్‌ఓ చరణ్, ఉపసర్పంచ్ సుశీల, కోఆర్డినేటర్ గుండె ఈశ్వర్, ఆప్తమాలజిస్ట్ రవి, ఏఎన్‌ఎంలు నాగరాణి, శ్వేత, బోడ సైదులు, తెలుసూరి సోమయ్య, అంగన్‌వాడీ టీచర్ లిల్లి, ఆశ కార్యకర్తలు విజయ, నాగమ్మ, గ్రామస్తులు, వైద్యసిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



కంటి వెలుగు శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎంపీపీ మన్నె రేణుకలక్ష్మీనర్సయ్యయాదవ్

ఓటుహక్కుకు దరఖాస్తు చేసుకోవాలి

నాగారం : 18ఏళ్లు నిండిన ప్రతిఒక్కరూ ఓటుహక్కుకు దరఖాస్తు చేసుకోవాలని తహసీల్దార్ హరిశ్చంద్రప్రసాద్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో ఓటరు నమోదుపై బీఎల్‌ఓలతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈనెల 30లోపు అర్హుల నుంచి దరఖాస్తులు స్వీకరించాలని సూచించారు. నూతన ఓటు నమోదు కొరకు, మార్పులు, చేర్పులు, సవరణల కొరకు ఆన్‌లైన్ ద్వారా, బీఎల్‌ఓల వద్ద దరఖాస్తు చేసుకోవాలన్నారు. సమావేశంలో డిప్యూటీ తహసీల్దార్ షాహిన్ బేగం, ఆర్‌ఐ లక్ష్మీనర్సింహారావు, సీనియర్ అసిస్టెంట్ ఉప్పలయ్య, బీఎల్‌ఓలు పాల్గొన్నారు.

నూతనకల్ : అర్హులైన ప్రతిఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలని తహసీల్దార్ ఎండీ జమీరుద్దీన్ కోరారు. గురువారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో బీఎల్‌ఓలకు ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు.



నాగారం : మాట్లాడుతున్న తహసీల్దార్ హరిశ్చంద్రప్రసాద్

18సంవత్సరాలు నిండిన యువతి, యువకులు ఓటరుగా నమోదు కావాలని ఆయన సూచించారు. భారత రాజ్యాంగం ప్రకారం ఓటు అనే వజ్రాయుధాన్ని ప్రతిఒక్కరూ వినియోగించుకునే విధంగా ప్రతి ఒక్కరినీ ఓటరుగా నమోదు చేయాలని సూచించారు. సమావేశంలో రెవెన్యూ సిబ్బంది, బీఎల్‌ఓలు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా బీఆర్‌ఎస్ ఆవిర్భావ వేడుకలు

తుంగతుర్తి : మండల కేంద్రంలో బీఆర్‌ఎస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని ఆ పార్టీ నాయకులు గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయం ఎదుట పార్టీ జెండాను మండల అధ్యక్షుడు తాటికొండ సీతయ్య ఆవిష్కరించి మాట్లాడారు. సీఎం కేసీఆర్‌తోనే దేశాభివృద్ధి సాధ్యమన్నారు. వచ్చే ఎన్నికల్లో బీఆర్‌ఎస్ గెలుపే లక్ష్యంగా కార్యకర్తలు పనిచేయాలన్నారు. కార్యక్రమంలో డీసీసీబీ డైరెక్టర్ గుడిపాటి సైదులు, నల్లు రామచంద్రారెడ్డి, శ్రీనివాస్, వెంకటనారాయణ, దుర్గాయ్య, భిక్షం, కటకం సూరయ్య, జలేందర్, సంతోష్, రవికుమార్, రాములు, వీరయ్య, వెంకటేష్, ఎల్లయ్య, నాగయ్య, వెంకన్న రమేష్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.



పార్టీ జెండాను ఆవిష్కరిస్తున్న నాయకులు

ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాలి



మాట్లాడుతున్న కందుకూరి సోమయ్య

తిరుమలగిరి (తుంగతుర్తి) : ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణకు పార్లమెంట్ ద్వారా చట్టబద్ధత కల్పించాలని ఎంఎస్‌పీ జిల్లా ఇన్‌చార్జ్ కందుకూరి సోమన్న కోరారు. గురువారం మండలంలోని వెలిశాలలో నిర్వహించిన సంఘం సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. పార్లమెంట్ ద్వారా చట్టబద్ధత కల్పించే విషయంలో పూర్తిగా నిర్లక్ష్యం వహిస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు తమ ఓటు బ్యాంకు ద్వారా గుణపాఠం చెబుతామని హెచ్చరించారు. మాదిగలు ప్రత్యక్ష రాజకీయ పోరాటాలకు సిద్ధం కావాలని అన్నారు. ఈ సందర్భంగా వెలిశాల గ్రామ నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఏపూరి సమ్మయ్య, ఉపాధ్యక్షుడిగా మైసయ్య, ప్రధాన కార్యదర్శిగా సురేష్, కార్యదర్శిగా సంపత్, ప్రచార కార్యదర్శిగా శివాజీ ఎన్నికయ్యారు.

కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా కోఆర్డినేటర్‌గా నవీన్‌చారి

తుంగతుర్తి : కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా నియోజకవర్గ కోఆర్డినేటర్‌గా మండల పరిధిలోని వెలుగుపల్లి గ్రామానికి చెందిన రామడుగు నవీన్‌చారి గురువారం నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఆ పార్టీ సోషల్ మీడియా రాష్ట్ర కోఆర్డినేటర్ పెట్టేం నవీన్ నియామకపత్రాన్ని అందజేశారు. అనంతరం నవీన్‌చారి మాట్లాడుతూ.. తన నియామకానికి సహకరించిన నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.



నృసింహుడి కల్యాణోత్సవాలను జయప్రదం చేయాలి

మఠంపల్లి : జిల్లాలో ప్రసిద్ధిగాంచిన మట్టపల్లి శ్రీలక్ష్మీనరసింహస్వామి క్షేత్రంలో మే 3 నుంచి 6 వరకు జరగబోయే కల్యాణ మహోత్సవాలను విజయవంతం చేయాలని హుజూర్‌నగర్ ఆర్డీఓ వెంకారెడ్డి కోరారు. గురువారం మట్టపల్లిలో దేవాలయ పరిసరాలు, కృష్ణానది, వివిధ కులాల అన్నదాన సత్రాలు, వాహనాల పార్కింగ్ స్థలాన్ని వివిధ శాఖల అధికారులు దేవస్థాన పాలకవర్గంతో కలిసి పరిశీలించి మాట్లాడారు. కల్యాణ మహోత్సవాల విజయవంతానికి అధికారులు, ప్రజాప్రతినిధులు, ఉద్యోగులు, స్వచ్ఛంద సంస్థల సభ్యులు, పరిశ్రమల యాజమాన్యాలు ప్రత్యేక కృషిచేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆలయ అనువంశిక ధర్మకర్తలు చెన్నూరు విజయ్‌కుమార్, చెన్నూరు మట్టపల్లిరావు, మాజీ ఎంపీటీసీ వెంకటరమణ, ఎస్‌ఐ ఇరుగు రవి, అధికారులు, అన్నదాన సత్ర కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.